క్లుప్తంగా

కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశం



కన్వీనర్లు, వలంటీర్లతో చర్చిస్తున్న బాపూ ఆనంద్

డాబాగార్డెన్స్: నియోజకవర్గ మండల అధ్యక్షుడు దొడ్డి బాపూ ఆనంద్ మంగళవారం పలు వార్డుల కన్వీనర్లు, వలంటీర్లతో సమావేశమయ్యారు. చిలకపేట నుంచి పద్మానగర్, గొల్లలపాలెం, ద్వారకాబజార్‌కు చెందిన కన్వీనర్లు, వలంటీర్లతో ఎస్‌బీఐ కాలనీ సచివాలయంలో సమావేశమై జగనన్న ఆరోగ్య సురక్ష, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు తీరుపై అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో శ్రీనివాసరావు, శ్రీదేవి, కాంట్రేగుల నాయుడు, మోహన్, గణేష్, వెంకటేష్, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఎఫ్‌ఏ2లో ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు



మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఎఫ్‌ఏ 2 టాపర్స్‌తో తల్లిదండ్రులు, అధ్యాపకులు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డు మధురానగర్ జీవీఎంసీ హైస్కూల్‌లో ఇటీవల జరిగిన ఎఫ్‌ఏ 2 పరీక్షల్లో అధిక మార్కులు సాధించిన విద్యార్థులను పాఠశాల హెచ్‌ఎం శాంతికుమారి, ఉపాధ్యాయులు అభినందించారు. పాఠశాల ఆవరణలో గల కళావేదికపై మంగళవారం ఉదయం ఎఫ్‌ఏ2 టాపర్స్, వారి తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించారు. సబ్జెక్టులు, తరగతుల వారీగా మొదటి ఐదు స్థానాల్లో నిలిచిన విద్యార్థులను అభినందించి, సొంతసొమ్ముతో సమకూర్చిన బహుమతులు అందజేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న జ్యోతికుమారి

ఏయూ క్యాంపస్: అరిలోవ ప్రాంతం తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ప్రాంతీయ విద్యా సంచాలకురాలు ఎం.జ్యోతికుమారి మంగళవారం సందర్శించారు. పదో తరగతి ఎఫ్‌ఏ 2 పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను అభినందించారు. రానున్న ఎస్‌ఎస్‌సీ పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు సాధించి, జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చినగదిలి మండల విద్యాశాఖ అధికారి అనూరాధ, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.కె.డి.భవాని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తృతీయ సోపాన్ టెస్టింగ్ క్యాంప్



ఎక్సర్‌సైజ్‌లు చేస్తున్న విద్యార్థినులు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ పరిధి తాటిచెట్లపాలెంలోని వాల్తేరు కేంద్రీయ విద్యాలయంలో సోమవారం నుంచి ప్రారంభమైన స్కౌట్స్ అండ్ గైడ్స్ తృతీయ సోపాన్ టెస్టింగ్ శిబిరంలో రెండవరోజు పలు కార్యక్రమాలు ఉత్సాహంగా జరిగాయి. వ్యాయామం వల్ల కలిగే ప్రయోజనాల గురించి వెటరన్ స్కౌట్ ఎస్‌ఎస్ మూర్తి వివరించారు. అనంతరం పలు పోటీలు, సాయంత్రం స్కూల్ ప్రాంగణంలో క్యాంప్‌ఫైర్ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కేవీ–2 ప్రిన్సిపాల్ శ్రీనివాసులు పాల్గొన్నారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. వాల్తేరు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ కమల్‌జీత్, ప్రైమరీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు శైలజ, సిబ్బంది ప్రభాకర్, ఎం.రేఖ, వై.విజయలక్ష్మి, జగన్‌మోహన్, మణిబాబు తదితరులు పాల్గొన్నారు.

సేవలు ఘనం.. సౌకర్యాలు శూన్యం



వైద్యం, మందుల కోసం చెట్టు నీడలో నిరీక్షిస్తున్న పేషెంట్లు

- డాబాగార్డెన్స్ సీజీహెచ్‌ఎస్ కేంద్రం వద్ద బెంచీలు లేక రిటైర్డ్ ఉద్యోగుల వెతలు
- ఇరుకైన ఆస్పత్రి ప్రాంగణంతో ఇక్కట్లు

డాబాగార్డెన్స్: వారంతా ఆరు పదులు పైబడిన వృద్ధులు. పదవీ విరమణ చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు. వీరంతా ఆరోగ్యపరంగా అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మందులు కూడా వీరి జీవితంలో ఒక భాగమే. వీరంతా కేంద్ర ప్రభుత్వంలోని వివిధ సంస్థల్లో పని చేసి పదవీ విరమణ పొందిన వారు. ప్రస్తుతం శేష జీవితం గడుపుతున్నారు. వీరికి కేంద్ర ప్రభుత్వం వైద్య పరంగా అన్ని సదుపాయాలు కల్పించింది.

తప్పని నిరీక్షణ..


సీనియర్ సిటిజన్లు అయిన రిటైర్డ్ కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రభుత్వం మొదట్లో పెదవాల్తేరులోని ఈఎస్‌టీ ఆసుపత్రి సమీపాన సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం కింద ఓ డిస్పెన్సరీ/ఆస్పత్రి ఏర్పాటు చేసింది. పదవీ విరమణ పొందిన వారంతా అక్కడే తమకు కావాల్సిన నెలవారీ మందులు తీసుకునేవారు. అవసరమైన వారు వైద్యులకు చూపించుకునేవారు. అయితే వీరి సంఖ్య వేలల్లో ఉండడంతో తమ వంతు వచ్చే వరకు నిరీక్షణకు అవస్థ పడేవారు. వేకువ జాము 4 గంటలకే వచ్చి క్యూలైన్‌లో వేచి ఉండేవారు.

డాబాగార్డెన్స్‌లో మరో కేంద్రం..

వీరి పరిస్థితిని గుర్తించిన కేంద్ర ప్రభుత్వం సిటీ పరిధిలోని డాబాగార్డెన్స్‌లో గల పోస్టాఫీస్ పక్కన మరో వైద్య కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అంత వరకూ బాగానే ఉంది. వీరికి వైద్యపరంగా అన్ని సదుపాయాలు కల్పిస్తున్నారు. నెలా నెలా మందుల కోసం తిరగలేని పరిస్థితిలో ఉన్న నేపథ్యంలో 3 నెలలకు సరిపడా మందు బిళ్లలు.. టానిక్స్ అందజేస్తున్నారు. ఆరోగ్యం క్షీణిస్తే.. వారు కోరుకున్న ప్రైవేట్/కార్పొరేట్ ఆసుపత్రిలో వైద్యం అందిస్తున్నారు. టెస్టులు కూడా ఒక్క పైసా తీసుకోకుండా చేయిస్తున్నారు. అంతా బాగానే ఉంది.

ఇక్కడే ట్విస్ట్..

వైద్యం కోసం వీరంతా తెల్లవారు జాము నుంచే క్యూలైన్లలో ఉండాల్సి వస్తోంది. ఎందుకంటే అధిక సంఖ్యలో పేషెంట్లు వస్తున్న దృష్ట్యా వీరిలో అనేక మంది తెల్లవారు జామునే క్యూలైన్ వద్దకు చేరుకుంటున్నారు. ఇక్కడి సేవలు ఉదయం 7.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉంటాయి. ఇద్దరు వైద్యుల పర్యవేక్షణలో వైద్యసేవలు అందుతున్నాయి.. మంచి మందులు ఇస్తున్నారు కానీ.. కూర్చోవడానికి సరైన కుర్చీలు లేక.. నిలబడడానికి సరైన షెల్టర్ లేక మండుటెండలోనే వేచి చూడాల్సి వస్తోంది. అసలే వయసైన వారు కనుక ఎండ వేడిమి తట్టుకోలేక ఉక్కిరిబిక్కిరవుతూ వేరే రోగాలు కొనితెచ్చుకుంటున్నారు. ఈ విషయంపై అక్కయ్యపాలేనికి చెందిన ఓ రిటైర్డ్ పోస్ట్‌మాస్టర్ సాక్షితో తన గోడు వెలిబుచ్చారు. పేషెంట్లు కూర్చునేందుకు వీలుగా లేదని, అసౌకర్యంగా ఉండడం వల్ల పేషెంట్లు నానా అవస్థలు పడాల్సి వస్తోందని, ఆసుపత్రి ప్రాంగణమంతా ఇరుగ్గా ఉండడంతో అవస్థ పడాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు.



పదవీ విరమణ చేసిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం ప్రభుత్వం సీజీహెచ్‌ఎస్ (సెంట్రల్ గవర్నమెంట్ హెల్త్ స్కీం) కింద మందులు, వైద్య సేవలు అందజేస్తోంది. పెదవాల్తేరులోని ఈఎస్‌టీ ఆసుపత్రి సమీపాన డిస్పెన్సరీ/ఆస్పత్రి ఏర్పాటు చేసింది. ఇక్కడ మందులు, వైద్య సేవలు సజావుగానే అందుతున్నాయి. ఇక్కడికి వచ్చే రోగుల సంఖ్య వేలల్లో ఉండడంతో ఆ రద్దీని తగ్గించేందుకు డాబాగార్డెన్స్ పోస్టాఫీస్ పక్కనే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. అంతా బాగానే ఉందనుకున్న తరుణంలో ఇక్కడికి వచ్చే రోగులు కూర్చునేందుకు సరైన సౌకర్యం లేక వారంతా ఇబ్బంది పడుతున్నారు. అలాగే ఇక్కడి వైద్య కేంద్రం కూడా ఇరుగ్గా ఉండడంతో వేచి ఉండే సదుపాయం లేక.. ఇరుకులో ఇబ్బంది పడుతున్నట్లు వృద్ధులు వాపోతున్నారు.

జగనన్న ఆరోగ్య సురక్షపై అవగాహన



ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఎల్లంకి చిన్నమ్మలు తదితరులు



వేంకటేశ్వరమెట్ట-2 సచివాలయం పరిధిలో జరిగిన కార్యక్రమంలో బొర్రా విజయలక్ష్మి తదితరులు

అల్లిపురం: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వార్డుల్లో చురుగ్గా నిర్వహిస్తున్నారు. పలు సచివాలయాల పరిధిలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ప్రజలకు అవగాహన కల్పించారు.

- 33వార్డు వేంకటేశ్వరమెట్టలో జరిగిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు మహిళా అధ్యక్షురాలు ఎల్లంకి చిన్నమ్మలు ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. వారికి జగనన్న ఆరోగ్య సురక్ష పథకంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఆశ వర్కర్ బి.లీలావతి, వలంటీర్ విజయ ధనలక్ష్మితో కలిసి కార్యక్రమం నిర్వహించారు.
- వేంకటేశ్వరమెట్ట 2 సచివాలయం పరిధిలో నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం చైర్‌పర్సన్ బొర్రా విజయలక్ష్మి ఆధ్వర్యంలో ఆశ వర్కర్ జ్యోతి, గృహసారథులు చిన్నిలక్ష్మి, సూర్య, బొర్రా శ్రీనివాసరెడ్డి, వైద్య సిబ్బంది డాక్టర్ రాము ఇంటింటికీ వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్తగా ఉండాలని ప్రజలకు సూచించారు.

కూడళ్ల అభివృద్ధి పనులు వేగవంతం

జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ



మహారాణిపార్లర్ కూడలి అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

సీతంపేట: స్మార్ట్ సిటీ పనుల్లో భాగంగా నగరంలో పలు కూడళ్లలో చేపడుతున్న అభివృద్ధి, రోడ్ల విస్తరణ పనులు వేగవంతం చేయాలని జీవీఎంసీ ఇంజినీరింగ్ అధికారులను జీవీఎంసీ కమిషనర్ సి.ఎం.సాయికాంత్ వర్మ ఆదేశించారు. జీవీఎంసీ జోన్ 3,4,5 పరిధిలోని ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రోడ్డు, ఏఎస్ఆర్ కాలేజీ గ్రౌండ్ జంక్షన్, అక్కయ్యపాలెం మహారాణి పార్లర్ జంక్షన్, న్యూకాలనీ జంక్షన్ వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను మంగళవారం కమిషనర్ పరిశీలించారు. పెదవాల్తేర్ పోలమాంబ గుడి ఎదురుగా ఉన్న ప్రభుత్వ ఛాతీ ఆస్పత్రి రోడ్డులో విస్తరణ పనులతో పాటు సెంటర్ మీడియన్, గ్రీనరీ అభివృద్ధి పనులు వేగవంతం చేయాలన్నారు. రోడ్డు విస్తరణకు అడ్డంగా ఉన్న చెట్లకు ఎటువంటి నష్టం కలగకుండా రోడ్డు పక్కన గ్రీనరీ ప్రాంతంలోకి మార్పు చేయాలని ఆదేశించారు. నగరంలో రద్దీ దృష్ట్యా స్మార్ట్ సిటీ నిధులతో రోడ్ల విస్తరణతోపాటు కూడళ్లను అభివృద్ధి చేస్తున్నట్టు కమిషనర్ తెలిపారు. ఈ పనుల సందర్భంగా కూడళ్లలో ఉన్న విగ్రహాలకు హాని కలగకుండా చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈకార్యక్రమంలో పర్యవేక్షక ఇంజినీర్లు వినయ్‌కుమార్, వేణుగోపాల్, జోనల్ కమిషనర్లు విజయలక్ష్మి, శివప్రసాద్, ఆర్.జి.వి.కృష్ణ, ఏపీయూఐఏంఎల్ ప్రతినిధి చేతన్, కార్యనిర్వాహక ఇంజినీర్ మత్స్యరాజు,ఏఎంఓహెచ్‌లు రాజేష్, సునీల్‌కుమార్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం



రక్తదానం చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న డాక్టర్ పైడి కళా వెంకటరమణమూర్తి

సీతమ్మధార: సీజనల్ వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని, కాచి వడపోసి చల్లార్చిన నీటిని తాగాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కళా ఆస్పత్రి అధినేత డాక్టర్ పైడి కళా వెంకటరమణమూర్తి తెలిపారు. కళా హాస్పటల్, రోటరీ బ్లడ్ బ్యాంక్ సంయుక్తంగా కళా హాస్పటల్ ఆవరణలో మంగళవారం ఉచిత మెగా రక్తదాన శిబిరం నిర్వహించాయి. ఈ శిబిరంలో అధిక సంఖ్యలో యువకులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా వెంకటర మణమూర్తి, కళావతి మాట్లాడుతూ వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు అధికంగా వ్యాపిస్తుండడంతో నగరంలో రక్త నిల్వల కొరత ఉందని, దీంతో సకాలంలో రక్తం సమకూరక రోగులు ఇబ్బందులకు గురవుతున్నారని చెప్పారు. యువత రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో ఆస్పత్రి సిబ్బంది, రోటరీ బ్లడ్ బ్యాంకు చైర్మన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై వాహనాలు నిలిపితే చర్యలు



బాలయ్యశాస్త్రిలేఅవుట్ రోడ్డుపై నిలిపివేసిన వాహనాలు

సీతమ్మధార: రోడ్డుపై ఇష్టానుసారం వాహనాలు నిలిపితే యజమానులపై చర్యలు తీసుకుంటామని ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ రామ్మూర్తి హెచ్చరించారు. జీవీఎంసీ పరిధి 14వ వార్డు బాలయ్య శాస్త్రిలేఅవుట్‌లోని అభయాంజనేయ స్వామి ఆర్చి రోడ్డులో ఇరానీ టీ షాపు వద్ద రోడ్డుపై ఇష్టానుసారంగా వాహనాలు నిలిపివేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య ఏర్పాడుతోంది. దీంతో స్థానికులు ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ రామ్మూర్తికి ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆయన సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. షాపులకు సంబంధించిన బోర్డులు రోడ్డుపై కాకుండా లోపల పెట్టుకునేలా ఆదేశించారు. మళ్లీ రోడ్డుపై వాహనాలు నిలిపి స్థానికులకు, పాదాచారులకు ఇబ్బంది పెడితే వాహనయజమానులపై చట్ట పరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వృద్ధులకు రుషికొండ వెంకన్న దర్శనం



వేంకటేశ్వరస్వామి ఆలయంలో దర్శనానికి వచ్చిన వృద్ధులు

మురళీనగర్: పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో ఆశ్రయం పొందుతున్న వృద్ధులకు వెంకన్న దర్శనం లభించింది. వృద్ధాశ్రమం నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఇక్కడ ఆశ్రయం పొందుతున్న వృద్ధుల కోరిక మేరకు రుషికొండ సమీపంలోని తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో నెలకొల్పిన వేంకటేశ్వరుడి ఆలయానికి మంగళవారం తీసుకుని వెళ్లారు. వీరు స్వామి దర్శించుకుని ఆలయంలో కాసేపు ఆనందంగా గడిపారు. స్వామి దర్శన భాగ్యం కల్పించిన శ్రీనివాస్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

22న శరీరసౌష్టవ పోటీలకు ఎంపికలు

సీతమ్మధార: ది ఆంధ్రా బాడీబిల్డర్స్ సంఘం ఆధ్వర్యంలో ఈనెల 29న భీమవరంలో నిర్వహించబోయే రాష్ట్ర స్థాయి శరీర సౌష్టవ పోటీలకు జిల్లా స్థాయిలో బాడీబిల్డర్లను ఎంపిక చేస్తున్నట్టు విశాఖ బాడీబిల్డర్స్ అండ్ ఫిట్‌నెస్ సంఘం ప్రధాన కార్యదర్శి బి.కోటిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 22న హెచ్‌బీకాలనీలో గల మజిల్ ప్లానెట్ జిమ్‌లో ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు ఎంపికలు జరుగుతాయన్నారు. ఆసక్తి గల బాడీ బిల్డర్స్ హాజరుకావాలని కోరారు.

జీవీఎంసీ షెల్టర్ల సేవలు నిరుపమానం



మాట్లాడుతున్న ఈస్ట్ ఏసీపీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి

సీతమ్మధార: కరోనా సమయంలో జీవీఎంసీ షెల్టర్లు ఎంతో మందిని కాపాడాయని ఈస్ట్ ఏసీపీ డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి అన్నారు. నిరాశ్రయులకు అండగా పోలీస్ శాఖ, జీవీఎంసీ, స్వచ్ఛంద సంస్థలు మంగళవారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో సిబ్బందికి తగు ఆదేశాలిచ్చి నిరాశ్రయుల పునరావాసం కోసం కలిసి పని చేస్తామని అన్నారు. ప్రతి ఏడాది అక్టోబర్ 10న నిరాశ్రయుల దినోత్సవాన్ని జరుపుకుంటామని ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. సహకరిస్తున్న పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కేజీహెచ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ రాధాకృష్ణ, జీవీఎంసీ పీవో, లక్ష్మి, ఏయూటీడీ కార్యదర్శి కుమార్, సభ్యులు టి.ప్రసాద్, పి.జనార్దన్, సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన



అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణపుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో కె. తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

12న సహస్ర తులసిపూజ..

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 12న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో కె. శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని ఈవో పేర్కొన్నారు.

అలరించిన భక్తి సంగీత విభావరి



కచేరీ నిర్వహిస్తున్న తోలేటి బుచ్చిబాబు

డాబాగార్డెన్స్: ఇసుకకొండ (బాబాజీకొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో మంగళవారం ఉదయం 10 నుంచి 12 గంటల వరకు భక్తి సంగీత విభావరి నిర్వహించారు. దేవదాయ శాఖ ఆదేశాల మేరకు ధర్మప్రచార వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ప్రముఖ వీణ, గాత్ర విద్వాంసుడు తోలేటి బుచ్చిబాబు వీణానాదం, గాత్ర సంగీత విభావరి భక్తులను అలరించింది. వారోత్సవాల్లో భాగంగా బుధవారం కూచిపూడి నృత్యాలు, 12న భజనలు, 13న కోలాటాలు, 14న పారాయణం నిర్వహించనున్నట్టు ఆలయ ఈవో బుద్ధ మహాలక్ష్మీ నగేష్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు ఫణిహారం నరసింహమూర్తి, ఆలయ సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ రద్దీతో తిప్పలు

అల్లిపురం మెయిన్‌రోడ్డులో నిత్యం ఇదే తంతు



అల్లిపురం గాంధీ బొమ్మ వద్ద ట్రాఫిక్ రద్దీ

అల్లిపురం: నిత్యం ట్రాఫిక్ రద్దీతో అల్లిపురం మెయిన్‌రోడ్డులో వాహన చోదకులు అవస్థలు పడుతున్నారు. బీఆర్ రెడ్డి జంక్షన్ నుంచి కెప్టెన్ రామారావు జంక్షన్ వరకు రోడ్డుకి ఇరువైపులా ఆక్రమణలతో నిండిపోవడంతో ట్రాఫిక్ ఎప్పటికప్పుడు నిలిచిపోతుందని పాదచారులు, వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరో పక్క ఏపీఈపీడీసీఎల్ అండర్ గ్రౌండ్ విద్యుత్ కేబుల్స్ పేరిట మెయిన్‌రోడ్డులో విద్యుత్ డీబీ బాక్సులు ఏర్పాటు చేయటంతో ఆక్రమణలు ఎక్కువయ్యాయి. ద్విచక్ర వాహనాలు రోడ్డుకిరువైపులా నిలిపివేయటంతో రోడ్డు కుంచించుకుపోతోంది. వాటికి తోడు జీవీఎంసీ పారిశుధ్య సిబ్బంది డంపర్ బిన్‌లు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల పక్కన ఏర్పాటు చేస్తున్నారు. వాటిని అనుసరించి మోడల్ స్కూల్ వద్ద ఆటోలు, కార్లు నిలుపుదల చేస్తున్నారు. దీంతో సింహాలదేవిడి, మోడల్ స్కూల్, బంగారుమెట్ట రోడ్డు, కోదండ రామాలయం వద్ద రోడ్డు పది అడుగులకు కుంచించుకుపోయింది. పైగా ఈ ప్రాంతంలో హోల్‌సేల్ దుకాణాలు అధికంగా ఉండటంతో గూడ్స్ వాహనాలు నిలిపివేయటంతో కెప్టెన్ రామారావు జంక్షన్‌లో కూడా ట్రాఫిక్ నిలిచిపోతుందని స్థానికులు వాపోతున్నారు. జీవీఎంసీ, ట్రాఫిక్ పోలీసులు సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

టెన్నిస్ క్రీడాకారిణికి అభినందన



టెన్నిస్ క్రీడాకారిణి సాయి శ్రీఅనిషాను అభినందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: జాతీయ స్థాయిలో ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ సౌత్ జోన్ యూనివర్సిటీ పోటీల్లో పాల్గొన్న లాన్ టెన్నిస్ క్రీడాకారిణి కె.సాయి శ్రీఅనిషాను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి మంగళవారం తన కార్యాలయంలో అభినందించారు. ఇటీవల నిర్వహించిన ఖేలో ఇండియా యూనివర్సిటీ పోటీల్లో ఆమె పాల్గొన్నారు. లాన్ టెన్నిస్‌లో ఉన్నత స్థానాలను అధిరోహించాలని వీసీ ఆశాభావం వ్యక్తం చేశారు. అనిషాకు హైదరాబాద్‌కు చెందిన నాట్కో ఫార్మా స్పాన్సర్‌షిప్ అందిస్తుందని ఆమె తండ్రి పరశురామ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏయూ డైరెక్టర్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఎస్.విజయ్‌మోహన్, ఏయూ వ్యాయామ విద్యా విభాగాధిపతి ఆచార్య ఎ.పల్లవి, తదితరులు పాల్గొన్నారు.

15 నుంచి లలితాపీఠంలో శరన్నవరాత్రులు



ప్రత్యేక అలంకరణలో మహాలక్ష్మి అమ్మవారు



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తదితరులు

సీతంపేట: శ్రీలలితా పీఠంలో ఈనెల 15వ తేదీ నుంచి 24వ తేదీ వరకు శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నట్టు పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. దీనికి సంబంధించిన కరపత్రాలను మంగళవారం ఆయన పీఠం దర్బారు హాల్లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పంచాయతన యాగపూర్వక శత చండీ యాగం నిర్వహించనున్నట్టు చెప్పారు. ప్రతిరోజు ఉదయం 4 గంటలకు లలిత అమ్మవారికి పంచామృత అభిషేకం, అర్చన, బాలభోగం నివేదన జరుగుతుందన్నారు. అనంతరం చండీ పారాయణ, గోపూజ, శ్రీచక్ర నవావరణార్చన, సాయంత్రం చండీ హోమం, సామూహిక కుంకుమార్చన జరుగుతాయని తెలిపారు. నవరాత్రి ఉత్సవాల్లో అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారని చెప్పారు. 15న బాలత్రిపుర సుందరీ దేవి అలంకారం, 16న గాయత్రి దేవి, 17న అన్నపూర్ణాదేవి, 18న మహాలక్ష్మి, 19న లలితా కామేశ్వరి దేవి, 20న సరస్వతి దేవి, 21న దుర్గాదేవి, 22న మహిషాసురమర్దని, 23న రాజరాజేశ్వరి దేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇస్తారని తెలిపారు. 24న మహా పూర్ణాహుతి, సాయంత్రం అమ్మవారి పల్లకీ సేవ నిర్వహించనున్నట్టు తెలిపారు. ప్రతి రోజూ విశేష హోమాలు, పూజలు జరుగుతాయని భక్తులు పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్ మాస్టారు, గరిమెళ్ళ నాగభూషణం పంతులు, సందీప్ వర్మ పాల్గొన్నారు.

సాంస్కృతిక కార్యక్రమాల వివరాలు

ఉత్సవాల సందర్భంగా సాయంత్రం 6 గంటల నుంచి 8.30 గంటల వరకు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు చెప్పారు. 15వ తేదీన చైతన్య బ్రదర్స్ వారి శిష్య బృందంచే అన్నమయ్య సంకీర్తనల గానల హరి, 16న శ్రీద్వారం త్యాగరాజు మ్యూజికల్ అకాడమీ వారిచే భక్తి సంగీత కార్యక్రమం, 17న శ్రీలలిత శ్రీనివాస్ బాల భవన్ బాలబాలికలచే కూచిపూడి నృత్య ప్రదర్శన, 18,20 తేదీల్లో చైతన్య బ్రదర్స్‌చే అన్నమయ్య భక్తి సంగీత కార్యక్రమం, 19న షిర్డీ సాయి సంగీత నిలయం సుశీల,శిష్యులతో అన్నమయ్య సంగీత కార్యక్రమం, 21న సాయి కళానికేతన్ రాగిణి కూచిపూడి నాట్యమండలి వారి కూచిపూడి నృత్య ప్రదర్శన, 22న గజముఖ నృత్య నికేతన్ ఆధ్వర్యంలో గోపీరాజ్ శిష్యులతో కూచిపూడి నృత్య ప్రదర్శన, 23న కృష్ణ మందిరం మ్యూజిక్ అండ్ డ్యాన్స్ అకాడమీచే నృత్య ప్రదర్శన, 24న సత్యరాజ్ సంగీతాలయ బాల గణేష్ బృందంచే భక్తి సం గీత కార్యక్రమం నిర్వహించనున్నట్టు తెలిపారు.